www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 14 మే 2025



ఖేలో ఇండియాలో జూహితకు రజతం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నటు వంటి జూహిత గుణ సోమవారం సాయంత్రం బీహార్‌లో జరిగినటువంటి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో 71 కేజీల కేటగిరీ వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, హెచ్ఎం అంకం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కందికొండ రమేష్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలతో ఉన్నతికి ఎదగాలని అందరూ ఆకాంక్షించారు.

భద్రత లేని బతుకులు

- విస్తరిస్తున్న గిగ్ వ్యవస్థ
- గుర్తింపునకు నోచుకోని వర్కర్లు
- వర్తించని పిఎఫ్.ఇఎస్ఐ, గ్రాడ్యుటీ, బోనస్
- పట్టించుకోని ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డిజిటల్ వేదికల ద్వారా వినియోగదారులకు ఆహార పదార్థాలు,మందులు, వస్తువులు తెచ్చి ఇచ్చేవారు, రవాణా సేవలు అందించేవారిని గిగ్ వర్కర్లు అంటారు. జొమోటో, స్విగ్గీ, ఉబర్, ఓలా, డూన్జీ, జెప్టో, ర్యాపిడో తదితర సంస్థల్లో పని చేస్తున్నారు. వీరికి ఆయా సంస్థలు కనీస వేతనాలు ఇవ్వరు. కార్మిక చట్టాల ప్రకారం అందించే సౌకర్యాలు అందవు. ఎటువంటి భద్రత లేకుండానే వర్కర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా సమస్యల పట్ల ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3 వేల నుంచి 3,500 వరకూ వివిధ సంస్థల్లో గిగ్ వర్కర్లు పని చేస్తున్నారు. ప్రస్తుతం నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం వలన ఉపాధి మార్గాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో అనేకమంది స్వయం ఉపాధి మార్గాలను ఎన్నుకుంటున్నారు. గిగ్ వర్కర్లుగా సైతం పని చేస్తున్నారు. గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వాళ్ళు సైతం ఈ రంగంలో ఉపాధి కోసం చేరుతున్నారు. ఈ నేపథ్యంలో వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న కార్పొరేట్ సంస్థలు గిగ్ వర్కర్ల శ్రమను దోచుకుంటున్నాయి.

కార్మికులుగా లేని గుర్తింపు

గిగ్ వర్కర్లను ఆయా కంపెనీలు అసోసియేట్ పార్టనర్స్‌గా చేర్చుకుంటున్నాయి. అయితే కార్మికులుగా మాత్రం గుర్తించరు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కార్మికులుగా గనక గుర్తిస్తే ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించాల్సి వస్తుంది. అలాగే పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలి. పనికి తగిన బోనస్ ఇవ్వాలి. గ్రాడ్యుటి చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి. అయితే కార్మిక చట్టాల్లో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుంటున్న ఆయా కంపెనీలు వీరిని అసోసియేట్ పార్టనర్స్‌గా పనిలో పెట్టుకున్నాయి. కంపెనీలో కార్మికులు చేస్తున్న ప్రతి పనినీ వీళ్ళతో చేయిస్తున్నారు. కొరియర్, పోస్టల్ డిపార్ట్మెంట్లలో సర్వీసు చేస్తున్న వారందరికీ కార్మిక చట్టాలు వర్తిస్తాయి. కానీ అంతకంటే ఎక్కువగా పని చేస్తున్న గిగ్ వర్కర్లకు మాత్రం చట్టాలు వర్తించకుండా యాజమాన్యాలు మోసం చేస్తున్నాయి.

శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ

వీరికి ఇప్పుడున్న కార్మిక చట్టాలు అమలు కావటం లేదు. దానితో ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని గంధరగోళంలో బతుకుతున్నారు. రోజుకు ఎంత ఆదాయం వస్తుందో చెప్పలేని పరిస్థితి. ఎక్కడ ఏ రకమైన దాడి జరుగుతుందో భయభ్రాంతులతో పనిచేస్తున్నారు. కమీషన్ బేస్ ప్రకారం పని చేస్తున్నారు. వినియోగదారుడు బుకింగ్ చేసిన విలువలో కేవలం 5 నుంచి 30 శాతం మాత్రమే కమిషన్‌గా జమ చేస్తున్నారు. రవాణా రంగంలో సొంత వాహనం, సొంత ఇంధనం కలిగి ఉంటుంటే కేవలం 30 శాతం మాత్రమే సంస్థలు గిగ్ వర్కర్లకు కమిషన్‌గా అందజేస్తున్నాయి.

కమీషన్‌ను తగ్గిస్తున్న యాజమాన్యాలు

గిగ్ వ్యవస్థకు ఇటీవల ప్రాధాన్యత బాగా పెరుగుతుంది. దీంతో కమీషన్ కూడా సంస్థలు తగ్గిస్తున్నాయి. అలాగే ఆహార పదార్థాలను బుకింగ్ చేసుకుంటుంటే భారీగా ధరల వ్యత్యాసం కనిపిస్తుంది. ప్రజలను దోచుకుంటుండగా వర్కర్లకు మాత్రం కమీషన్లను గణనీయంగా తగ్గిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యాలకు సంబంధం లేకుండా చట్టాలను వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్కర్లు ప్రమాదంలో గనుక చనిపోతే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. వారిని ఆదుకునే వారు ఎవరు కనిపించడం లేదు. ప్రభుత్వం కూడా వీరికి అనుకూలంగా ఎటువంటి చట్టాలు తీసుకురావడం లేదు. మరోవైపు ఆయా యాజమాన్యాలు వర్కర్లపై పోటీ తత్వాన్ని పెంచుతున్నాయి. సమయానికి వెళ్ళకపోతే కమీషన్‌లో కోత పెడుతున్నాయి. దీంతో సమయం ఒత్తిడి వర్కర్లపై విపరీతంగా పడుతుంది. కొంతమంది ఆకతాయిలు వర్కర్లపై భౌతికంగా దాడులకు దిగుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో ఒక అపార్ట్‌మెంట్లో ఒక వర్కర్‌పై కొందరు అనుచితంగా ప్రవర్తించారు. బట్టలు విప్పి దాడి చేశారు. దీంతో సంబంధిత అపార్ట్‌మెంట్లో ఆర్డర్లు ఇచ్చేది లేదంటూ గిగ్ వర్కర్లు బాయ్ కట్ చేసిన పరిస్థితి ఉంది. ఇటువంటి ఘటనలు అనేకచోట్ల జరుగుతున్నాయి. కానీ వెలుగులోకి రావడం లేదు. కానీ యాజమాన్యాలు మాత్రం వర్కర్లకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ విధంగా మానసిక ఒత్తిళ్లు వీరుపై పెరుగుతున్నాయి. పెట్రోల్ ధరలు పెరిగే కొద్దీ నిజ ఆదాయం తగ్గిపోతూ వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వర్కర్ల సమస్యలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్మికులుగా గుర్తించాలి



గిగ్ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మికులుగా గుర్తించాలి. కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలి. పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంతోపాటు బోనస్ అందించాలి. కనీస వేతనాలను అమలు చేయాలి. భౌతిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో చట్టపరమైన రక్షణ కల్పించాలి.

-సిహెచ్.రాజ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు తదితరులు

సృజనాత్మక పఠనంతో విజయం

డిఎస్‌సి అవగాహనా సదస్సులో మాజీ ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రణాళికాబద్ధమైన సృజనాత్మక పఠనంతోనే డిఎస్‌సిలో విజయం సాధ్యమవుతుందని కోచింగ్ నిపుణులు, మాజీ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో యుటిఎఫ్, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో డిఎస్‌సి అభ్యర్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. చదివే ప్రతి విషయాన్ని అవగాహనతో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన ప్రశ్నాపత్రాలను కూడా చూసుకోవాలన్నారు. అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ పరీక్షలకు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని డిఎస్‌సి పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధం కావాలని సూచించారు. సుదీర్ఘకాలం తర్వాత డిఎస్‌సిని నిర్వహించడంతో పోటీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. డిఎస్‌సి పరీక్షలకు సమయం తక్కువగా ఉందని, గడువు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం గడువు పెంచని పక్షంలో అభ్యర్థులు కొత్త విషయాలు ఎక్కువగా నేర్చుకునే కంటే అంతవరకూ చదివిన సబ్జెక్టును మననం చేసుకుంటూ పునశ్చరణ చేసుకుంటే మంచిదన్నారు. ముందుగా సిలబస్ తెలుసుకుని అంచనాలతో కష్టపడి చదివితే విజయం సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. అనంతరం లక్ష్మణరావు పత్రికల్లో రాసిన వ్యాసాల సంకలనంతో రూపొందించిన 'సమకాలీన వ్యాసాలు' పుస్తకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి ఆవిష్కరించారు. డిఎస్‌సి అభ్యర్థులకు లక్ష్మణరావు రాసిన 'విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం' స్టడీ మెటీరియల్‌ను 400 మంది అభ్యర్థులకు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, ఉపాధ్యక్షులు కె.విజయగౌరీ, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, పవన్ కుమార్ యుటిఎఫ్ కార్యదర్శులు కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, దయానిధి, రమణమూర్తి, ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.రూపస్‌రావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రవరం గ్రంథాలయంలో తనిఖీలు

చాగల్లు : చంద్రవరం శాఖా గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ఎం.శేఖర్‌బాబు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గ్రంథాలయంలో అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్న గదిని సందర్శించారు. వేసవి సెలవుల్లో శాఖ గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతుల్లో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలన్నారు. కొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో గల న్యూస్ పేపర్లు పోటీ పరీక్ష పుస్తకాలను చదువుకోవాలన్నారు. గొప్పవారంతా పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పొందారన్నారు.



హీరో శ్రీవిష్ణు తదితరులు

అప్సర థియేటర్‌లో 'సింగిల్' సందడి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని అప్సర థియేటర్‌లో 'సింగిల్' సినిమా యూనిట్ సందడి చేసింది. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజ్ రచన, దర్శకత్వంలో శ్రీవిష్ణు హీరోగా నటించిన 'సింగిల్' సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. ఈ నేపథ్యంలో చిత్ర బందం విజయోత్సవ యాత్ర సాగిస్తోంది. ఇందులో భాగంగా ఈ సినిమా ప్రదర్శిస్తున్న స్థానిక అప్సర థియేటర్‌కి బృందం వచ్చింది. హీరో శ్రీవిష్ణు, నటులు కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిషోర్ విచ్చేశారు. డప్పు వాయిద్యాల మధ్య గీత ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అప్సర థియేటర్ మేనేజర్ మధు తదితరులు వారికి స్వాగతం పలికారు. సినిమా ఎలా ఉంది, నచ్చిందా, కామెడీ అదిరిందా, బాగా ఎంజాయ్ చేస్తున్నారా..? అంటూ హీరో శ్రీవిష్ణు ప్రేక్షకులను అడిగారు. సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని శ్రీవిష్ణు కృతజ్ఞతలు తెలిపారు. వెన్నెల కిషోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో పలుసార్లు హీరో శ్రీవిష్ణు ప్రస్తావిస్తూ నవ్వులు పూయించారు.

క్వారీల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

క్వారీల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంసి, మైన్స్, ఆర్ అండ్ బి తదితర సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరం సమీపంలోని, రామదాసు పేట, సుబ్బారావు నగర్‌లోని మెటీరియలాజికల్ బెల్టులో మూడు దశాబ్దాలుగా రోడ్డు మెటల్ క్వారీలను నిర్వహిస్తున్నారన్నారు. క్వారీ లీజు పొందిన 51 సంస్థలు మెటల్ తవ్విన అనంతరం క్వారీని మట్టితో పూడ్చాలి అనే నిబంధనని పాటించలేదనే విషయం తెలియ వచ్చిందన్నారు. ఈ క్వారీల వల్ల రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రహదారి మార్గంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

క్వారీ లీజు సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఆయా క్వారీలని నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని లీజు దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండున్నర కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, దానికి ఫెన్సింగ్ వేయడంతోపాటు లైటింగ్, సైన్ బోర్డులు, సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అక్కడ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి సాంకేతిక అంశాల పరిశీలనకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన లీజుదారుల వివరాలను అన్ని శాఖలకు పంపాలని, రిక్లమేషన్ ఛార్జీల రికవరీ కోసం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తదుపరి 22ఎ కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణ చర్చించారు. రాజేంద్రనగర్, సుబ్బారావు పేట, నెహ్రూ నగర్, బర్మా కాలనీ, బత్తిన నగర్, సంజీవయ్య నగర్, సింహాచల నగర్, రామదాసు పేట, ఆనంద నగర్‌లో ఉన్న 22ఎ భూముల క్రమబద్ధీకరణ వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, మైనింగ్ శాఖ సహాయ సంచాలకులు డి.ఫణిభూషణ్‌రెడ్డి, నగర ప్రణాళిక అధికారి జి.కోటయ్య, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ ఎస్‌బివి.రెడ్డి, డిపిఆర్ఓ వై.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

సిఎం దృష్టికి 'గోపాలపురం' సమస్యలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం నియోజకవర్గంలో సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి స్థానిక ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు తీసుకెళ్లారు. అమరావతి సచివాలయంలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు ముఖ్యమంత్రిని కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ, తాడిపూడి కాలువలకు ఆధునీకీకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. నల్లజర్ల, దేవరపల్లి ద్వారకాతిరుమల మండల కేంద్రంలో ఉన్న పిహెచ్‌సిలను సిహెచ్‌సిలుగా అప్ గ్రేడ్ చేయాలని, ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎంఎల్ఎ తెలిపారు. జనసేన కార్యకర్త భార్య ఉన్నమట్ల సత్యలక్ష్మికి వైద్య చికిత్స నిమిత్తం రూ.3.50లక్షలు మంజూరయ్యాని, అయితే అవి వైద్యానికి సరిపోవని కోరడంతో రూ.6.50 లక్షలకు పెంచి ఎల్ఓసి మంజూరు చేయించినట్లు ఎంఎల్ఎ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్లో ఉన్న ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంజూరు చేయాలని కోరామన్నారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో ఈనెల 15 నుండి 18 వరకు ఆర్‌డిఎస్ఎస్ వర్క్స్ నూతన లైన్ నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్కొండపాడు, గౌరిపల్లి, చంద్రవరం, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని విద్యుత్ శాఖ మండల అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. వినియోగదారులు అందరూ సహకరించాలన్నారు. మార్కొండపాడు గ్రామానికి త్రీఫేస్ సరఫరా ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఉంటుందన్నారు. మిగతా బాలన్స్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - చాగల్లు

శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ విస్తరణ అధికారి (పి ఆర్ అండ్ ఆర్ డి) ఎస్.శ్రావణ్ కుమార్ మంగళవారం బ్రాహ్మణగూడెం గ్రామపంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో క్లాప్ మిత్రలు, గ్రామస్తులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రలకు అందజేయాలన్నారు. సంపద కేంద్రంలో తయారయ్యే వర్మీ కంపోస్టును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలను పాటించాలి


ప్రజాశక్తి - కొవ్వూరు

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని జెసి ఎస్.చిన్నరాముడు మిల్లర్లకు సూచించారు. మంగళవారం ఆర్‌డిఒ కార్యాలయంలో కొవ్వూరు డివిజన్ పరిధిలో ఉన్న మిల్లర్ల ప్రతినిధులతో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్లో జిల్లాకి నిర్దేశించిన 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టిందన్నారు. రైతుల వద్ద ఇంకా ధాన్యం మిగిలిపోవడంతో లక్ష్యాన్ని 3.30 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిందన్నారు. దీనికనుగుణంగా మండలంలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే సమయంలో విధిగా బి-రిజిస్టర్‌లో సంబంధిత లావాదేవీల వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ధాన్యం వివరాలు ఎ-రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, ఇన్‌ఛార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంఆర్ఆర్.ప్రేమ్‌కుమార్, ఎఎస్ఒ ఎం.నాగమల్లేశ్వరరావు, తహశీల్దార్ దుర్గాప్రసాద్, కొవ్వూరు డివిజన్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు సుంకరవల్లి రమేష్, ప్రతినిధులు సూరపనేని శివరామకృష్ణ, ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మిల్లర్ల ప్రతినిధులతో మాట్లాడుతున్న జెసి చిన్నరాముడు

కార్టూ'నిజం'



సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారు: వైఎస్ జగన్

సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు

విజయపథంలో గాయత్రి విద్యాసంస్థ

ప్రజాశక్తి - రాజానగరం

సాధారణ విద్యార్థులతో అసాధారణ విజయాలు సాధిస్తూ విజయపదంలో దూసుకుపోతుంది రాజానగరంలోని గాయత్రి విద్యాసంస్థ అంటున్నారు కరస్పాండెంట్ వివివిఎస్ఎన్.మూర్తి. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాలే దీనికి నిదర్శనం అంటున్నారు. విద్యాసంస్థ సాధించిన విజయాలు, విద్యాసంస్థ ప్రత్యేకతపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

రాజానగరం మండలం కానవరంలో 2014లో తమ విద్యాసంస్థను 60 మంది విద్యార్థులతో నర్సరీ నుంచి ఇంటర్ వరకూ తరగతులు ప్రారంభించామని తెలిపారు. అప్పటి నుంచి దినదిన ప్రవర్ధమానంగా విజయపథంలో దూసుకువచ్చిందన్నారు. ప్రస్తుతం 2,213 మంది విద్యార్థులు, 155 మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో తమ విద్యాసంస్థ నడుస్తుందన్నారు. ఈ లెక్కలే తమ విద్యాసంస్థలో అందుతున్న నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు. చాలామంది తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు ఫీజులు కట్టి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఎక్కడా తగ్గకుండా అతి తక్కువ ఫీజులతో తమ విద్యాసంస్థ దశాబ్దానికిపైగా ఉత్తమ విజయాలు సాధించడం అందరూ చూశారన్నారు. ఈ ఏడాది సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో తమ విద్యార్థి 1000 మార్కులకు 989 మార్కులు సాధించి రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచాడన్నారు. ఇది తమ సంస్థకు గర్వకారణమన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపక బృందం సహకారంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు.

తమ విద్యాసంస్థలో ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఆటపాటలతో పాటూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల టాలెంట్‌ను బట్టి ఆ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి వరకు తీసుకు వెళు_న్నామన్నారు. తరగతిలో ఒకరో ఇద్దరో కాకుండా అందరికీ మంచి మార్కులు తీసుకురావడమే ధ్యేయంగా బోధన అందిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా తమ విద్యాసంస్థలో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించామన్నారు. సమీపంలోని 54 ప్రాంతాల నుంచి తమ విద్యాసంస్థలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. వీరి కోసం 18 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. సుశిక్షితులైన డ్రైవర్లను నియమించామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన, తల్లిదండ్రులు లేని పిల్లలు 100 మందికి పైగా ఉచితంగా విద్యను అందిస్తున్నామన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన మరో వంద మందిని ఉచితంగా చదివిస్తున్నామన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు. మూడేళ్లుగా ఐఐటి ఫౌండేషన్ కోర్సులు అందిస్తున్నామన్నారు. వీటిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు ఆ తర్వాత సంవత్సరం ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా ప్రతి తరగతి నుంచి ఒక విద్యార్థికి ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఎంసెట్, నీట్, ఐఐటిలో విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామన్నారు. ప్రతి అంశంపై విద్యార్థి పట్టు సాధించేలా 'యువ నిర్మాణ సదస్సు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లో నిపుణులను తీసుకొచ్చి అతిథి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రాజకీయ రంగం నుంచి మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్, విద్యారంగం నుంచి నన్నయ యూనివర్సిటీ పూర్వపు విసి ముత్యాల నాయుడు, కళా రంగం నుంచి యాక్టర్ డాక్టర్ భద్రం, రవాణా రంగం నుంచి సిరి ఆనంద్, అగ్నిమాపక రంగం నుంచి ఫైర్ ఆఫీసర్, పోలీసు శాఖ నుంచి పలువురి అధికారులను తీసుకొచ్చి విద్యార్థులకు ఆయా రంగాలపై అవగాహన కల్పించామన్నారు.



వివివిఎస్ఎన్.మూర్తి
కరస్పాండెంట్



వి.దేవీబంగారం
ప్రిన్సిపల్,అకడమిక్ డైరెక్టర్





నేరాలు ఘోరాలు

ఏలేరు కాలువలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఏలేరు కాలువలో మంగళవారం ఈతకు దిగారు. వీరిలో ఇద్దరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఒడ్డును ఉన్న ఇతర విద్యార్థులు కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న రైతులు సత్యనారాయణ, సిద్దు నీటిలో కొట్టుకుపోతున్న కాకినాడ సిరి అనే కుర్రాడిని రక్షించారు. గ్రామానికి చెందిన పంది వీర వెంకట సత్యనారాయణ కాలువలో గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం ఫైర్ సిబ్బంది, పోలీస్ అధికారులు స్థానికులు గాలింపు చేపట్టారు. ఈ ప్రమాదంలో బయటపడ్డా యువకుడికి ఏలేశ్వరంలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ, వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏలేరు కాలువ నీటి ఉధృతిని తగ్గించి గల్లంతైన యువకుడి ఆచూకి తెలుసుకోవాలని సూచించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.92,050లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు. అలాగే జి.రాగంపేట గ్రామంలో నిర్వహించిన పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.72,560 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు చోట్ల జరిగిన దాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గొల్లప్రోలులో...

మండలంలోని కొడవలి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.4450 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్తపల్లిలో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లిలో గడ్డివామి దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపల్లి నుంచి సుబ్బంపేట వెళ్లే దారిలో వాకతిప్ప గ్రామానికి చెందిన లొల్ల వీర వెంకట సత్యనారాయణ పొలాన్ని జాను అనే వ్యక్తి కౌలుకి తీసుకోగా 8 ఎకరాల్లో కోతల కోసి వచ్చిన గడ్డిని భద్రపరచుకున్నాడు. ఐదు లక్షల విలువచేసే గడ్డిమేటను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గడ్డిమేటు దగ్ధం కావడంతో కౌలు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి ఒక కోడి పుంజు, రూ.8020 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రెండు గ్రావెల్ లారీలు సీజ్

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ, కోటి కేశవరం గ్రామాల పరిధిలోని గ్రావెల్ కొండల నుండి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రి రెడ్డి సుబ్రమణ్యం అనే వ్యక్తి లారీల ద్వారా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సీతానగరం ఎస్ఐ డి.రామకుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రెండు లారీలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై సీతానగరం ఎస్ఐ రామకుమార్ మాట్లాడుతూ పట్టుబడిన గ్రావెల్ లారీల వివరాలను మైనింగ్ శాఖ అధికారులకు తెలియజేశామని చెప్పారు. మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు ఆ లారీలకు తగిన జరిమానా విధిస్తామన్నారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ మరియు ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని బొబ్బర్లంక ఇసుక తెన్నెల్లో మంగళవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అమలాపురం అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు, సిఐ కె.కాత్యాయిని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇసుక తిన్నెల్లో నాటు సారా తయారు చేయడానికి నిల్వ ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారులకు నష్టం జరగకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక మెయిన్ రోడ్‌లోని తాళ్లూరి వారి సత్రంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బళ్లమూడి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తూనికలు కొలతలు వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ప్రతి సంవత్సరం లైసెన్సులు రెన్యువల్స్ చేయించుకోవా లన్నారు. తూనికలు, కొలతలు, ఇతర లైసెన్సులు వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. కల్తీలు, మోసాలకు దూరంగా ఉండాలన్నారు. తరచుగా షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తామని, మోసం కనబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వినియోగదారుల సంఘ సభ్యులు వి.శ్యామల, జిబిఆర్.చౌదరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వీధి విక్రయదారుల సర్వేను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అడిషినల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా సిబ్బందికి దీనిపై శిక్షణ ఇచ్చారు. వీధి విక్రయదారుల ఉపాధికి భద్రత కల్పించేందుకు, సబ్సిడీపై రుణాలు అందించేందుకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సర్వేలో భాగంగా నగరంలోని వీధి వ్యాపారులను సచివాలయాల వారీగా గుర్తించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వారికి జోన్లు కేటాయించి, గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అలాగే పిఎం స్వానిధి పథకం ద్వారా రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ అందిస్తామన్నారు. కనుక సర్వేను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సర్వేలో వీధి వ్యాపారి ఆధార్, ఫోన్ నెంబర్, వ్యాపారం చేసే స్థలం వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు. సర్వే పూర్తైన త్వరాత నివేదిక ప్రకారం నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసి, ఆయా జోన్లలో వీధి వ్యాపారులకు మార్కింగ్ ఇస్తామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులు ఎదుర్కొనే సమస్యలపై ఆయా సంఘాల ప్రతినిధులు లేదా వెండింగ్ కమిటీ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావొచ్చన్నారు. ఈ శిక్షణా సమావేశంలో సిఎంఎం రామలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ సీతారామమూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంరూరల్

పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని డిఆర్ఒ సీతారామమూర్తి తెలిపారు. డిఆర్ఒ చాంబర్‌లో పరీక్షలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ విద్యా సంవత్సరం కోల్పోకుండా రాష్ట్ర ప్రభుత్వం సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పదో తరగతి, ఇంటర్ ఎపి ఓపెన్ స్కూల్ (అపోస్) సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష ప్రారంభం అయ్యే గంట ముందు నుంచి పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారనానరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయని తెలిపారు. 28 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 3,167 మంది, ప్రయివేటు విద్యార్థులు 686 మంది మొత్తం 3,853 మంది పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. ఎపి ఓపెన్ స్కూల్ చెందిన పదవ తరగతి విద్యార్థులు 589 మందికి ఆరు పరీక్షా కేంద్రాలను కేటాయించామన్నారు. ఇంటర్ విద్యార్థులు 771 మందికి 4 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కింద నలుగురు డిప్యూటీ తహశీల్దార్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలను సెంట్రల్ స్ట్రాంగ్ రూమ్ నుంచి ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష పూర్తి అయిన తర్వాత పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా పంపే ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకో వాలన్నారు. పరీక్ష కేంద్రాలస మీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ఈ సమావేశంలో డిఇఒ కె.వాసుదేవరావు, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకుమారి, ఎంవిఐ సిహెచ్.సంపత్‌కుమార్, ఎస్ఐ, పివి.నారాయణస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.జాన్సన్‌రాజు, ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళాజాతాతో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రచారం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్


కళాజాతా ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వసుంధర

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ (దిశ) ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై జానపద కళాజాతా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టామని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర తెలిపారు. మంగళవారం స్థానిక వాంబే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లాను హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత జిల్లాగా చేయాలనే లక్ష్యంతో ఈ ప్రచార కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ వీధినాటిక కార్యక్రమాలు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి, ఎయిడ్స్ వ్యాధిగ్రాస్తులపై సమాజములో వివక్ష తగ్గించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లాలో 20 ముఖ్యమైన ప్రాంతాల్లో ఈ నెల 13 నుంచి 23 వరకు ఈ జాతాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్ ఎ.బుజ్జిబాబు, వైద్యాధికారి డాక్టర్ జ్యోతి కిరణ్, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు చైల్డ్ ఫండ్ ఇండియా, చేంజెస్, కెఎస్ఎమ్, యుఇటిఎస్, విహెచ్ఎస్, కళజాతా బృందాలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత సమాజం అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజానగరం

మాదక ద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం సమిష్టి బాధ్యత అని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) సిఐ పి.వి.సూర్యమోహనరావు అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సిపి, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్‌విఎస్ఎన్.మూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ఈగల్ సిఐ సూర్యమోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలు, గంజాయిపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం ఈగల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు సంబంధిత నేరాలకు విధించే శిక్షలు, చట్టాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్ఐ బి.నరేష్‌కుమార్, జిజియు ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-గోకవరం

సింగారమ్మ చింత అమ్మవారి ఆలయ అర్చకురాలు వట్టికూటి సీతామహాలక్ష్మికి న్యాయం చేయకపోతే ఈనెల 22 నుంచి నిరాహారదీక్ష చేపడతామని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఎగుపాటి అర్జున్‌రావు తెలిపారు. బాధితులతో కలిసి మంగళవారం ఎస్ఐ పవన్ కుమార్, తహశీల్దార్ సాయిప్రసాద్‌లకు ఫిర్యాదులను అందించారు. ఆయా కార్యాలయాల ఎదుట నిరసన నితెలిపారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడారు. సింగారమ్మ ఆలయం వద్ద పూర్వం నుంచి వంశపార్యపరంగా వస్తున్న అర్చకత్వాన్ని కొనసాగిస్తూ, అక్కడే చిన్నపాటి దుకాణం నిర్వహిస్తూ వట్టికూటి సీతామహాలక్ష్మి జీవనం సాగిస్తుందన్నారు. ఆమెపై మల్లిసాలకు చెందిన పెద్దలు, కమిటీ సభ్యులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. దౌర్జన్యంగా రాత్రికి రాత్రే దుకాణాన్ని ధ్వంసం చేయడంతో పాటు అమ్మవారి నగలు, ఇతర విలువైన వస్తువులను పట్టుకుపోయారన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదులు అందించినా నేటికీ పోలీసులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇదే అదునుగా పెద్దలు మంగళవారం ఉదయం సింగారమ్మ ఆలయం వద్ద కూల్చి వేసిన పాకతో పాటు ఇతర సామగ్రికి నిప్పంటించారన్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే ఈనెల 22 నుంచి గోకవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులతో పాటు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు జగ్గంపూడి రాజా, నాగులపల్లి అచ్చారావు, రొబ్బల శ్రీను, వీరబత్తుల చిన్నబ్బు, సిద్దాబత్తుల అప్పారావు పాల్గొన్నారు.

మహాలక్ష్మిని దర్శించుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కిరణ్మయి

ప్రజాశక్తి-కడియం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మంగళవారం కడియపులంక శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు వచ్చిన ఆమెకు సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారిని ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పంతం గణపతి, మహిళా నేత బోడపాటి రాజేశ్వరి, మల్లు బాబి, ఆలయ కమిటీ సభ్యులు రావిపాటి రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ప్రగడరెడ్డి రాంబాబు, పల్ల ప్రసాద్, పంతం శ్రీనివాస్, మద్దినాల ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గోకవరం


చెక్కు అందిస్తున్న జ్యోతుల నవీన్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ముదిలి రామచంద్రరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.45798 విలువ చేసే చెక్కును టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకుని ఎంఎల్ఎ సిఫార్సు లెటర్‌తో దరఖాస్తు చేసుకుంటే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మూర్తి, దిండి రాజు, అడబాల సింగరయ్య, ముదిలి సురేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


ఫిల్టర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో ఆయన విస్తతంగా పర్యటించారు. తొలుత వెంకటేశ్వరనగర్‌లోని 1000 కెఎల్ కెపాసిటీ వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు ఏదశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పుష్కర్ ఘాట్ వద్ద హెడ్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించారు. అక్కడ ఫిల్టరైజేషన్ ప్లాంట్ల పని తీరు, నిర్వహణ విధానం, నీటి సేకరణ మరియు శుద్ధి చేయు విధానం, ల్యాబ్‌లో వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. వేసవిలో ప్రజలకు నీటి కొరత లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటర్ పైప్ లైన్లలో గుర్తించిన లీకేజీలకు యుద్ధ ప్రతిపదికన అరికట్టాలన్నారు. తాగునీరు వృథా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 19, 25 వార్డులలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. పలుచోట్ల డ్రెయిన్ల ఆక్రమణలను ఆయన గుర్తించారు. ఆక్రమణలను తొలగించాలని ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఇ కోటేశ్వరరావు, ఇఇ మాధవి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

బీర విశ్వ శాంతి, భర్త: చిన బాబు, అనాతవరం, దంగేటివారి పాలెం వాసిని. ది 10-05-2025న నేను నా **పాస్‌పోర్ట్ నెం. ఎన్ 2887841** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ఆటోలో ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే ఈ పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

బీర విశ్వ శాంతి, భర్త: చినబాబు,
డోర్ నెం.9-28, దంగేటివారిపాలెం,
అనాతవరం, ముమ్మిడివరం మండలం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెం.91774 43468

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - శంఖవరం


పవలింపు సేవలో సత్యదేవుడు

సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల పుష్పయోగ ఘట్టంతో ఘనంగా ముగిశాయి. రాత్రి 8 గంటలకు రత్నగిరిపై గల నిత్యకళ్యాణ మండపం ఆవరణలో కోలాట నృత్యాలతో పుష్పయోగ కార్యక్రమానికి పళ్లు, తీపిపదార్థాలు, పువ్వులను తీసుకొచ్చారు. వధూవరులైన స్వామి, అమ్మవార్లకు పుష్పయోగానికి సంకల్పం చేశారు. ఆలయ సుబ్బారావు పట్టువస్త్రాలు సమర్పించిన ఛైర్మన్ రాజా ఐవి. రోహిత్, ఇఒ వీర్ల తరువాత స్వామి, అమ్మవార్లకు అర్చక స్వాములు బ్రహ్మముడులు వేసి సుమూహూర్తధారణ చేసి ఊంజల్ సేవ నిర్వహించారు. శేషపాన్పుపై పవళిస్తున్న స్వామివారిని అమ్మవారు సేవిస్తున్నట్లుగా అలంకరించగా వారికి అనేక రకాల పండ్లు, తీపి పదార్థాలు నివేదనగా పెట్టారు. తదుపరి పెద్దఎత్తున హాజరైన భక్తులు ఎదురుగా ఉంచిన అద్దంలో స్వామి, అమ్మవార్లను తనివితీరా దర్శించుకుని తరించారు. ఏకాంతసేవ ఆశీర్వచన కార్యక్రమం పూర్తిచేసి భక్తులకు ప్రసాద వితరణ తోపాటు మహిళలకు రవికలను పంపిణీ చేశారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

ప్రజాశక్తి - గండేపల్లి


ప్రయివేటు వసతి గృహాలను పరిశీలిస్తున్న పోలీసులు

విద్యార్థినీ, విద్యార్థులు ఎటువంటి వ్యసనాలకు బానిసలు కావద్దని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు విద్యాసంస్థలు, వసతి గృహాలను సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఎటువంటి మత్తు పదార్థాలు, పానీయాలు లేకుండా చూడాలని, అలాగే భద్రతా ఏర్పాట్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత వసతిగృహాలు, విద్యా సంస్థలకు చెందిన యాజమాన్యాలను ఆదేశించారు. వసతి గృహాలతోపాటు, పరిసర ప్రాంతాల్లో హై రీవెల్యూషన్ కలిగిన సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రయివేటు వసతి గృహాల చుట్టూ రక్షణ గోడలు సాధ్యమైనంత ఎత్తుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు బయటికి వెళ్లి, వచ్చేటప్పుడు ఇన్ అండ్ ఔట్ రిజిస్టర్‌ను సక్రమంగా మెయింటైన్ చేయాలని అన్నారు. ఎటువంటి ఈవ్ టీజింగ్, అనుమానిత వ్యక్తుల కదలికలను గుర్తిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట, పెద్దాపురం ఎస్ఐలు యువి.శివనాగబాబు, జి.సతీష్, రఘునందన్‌రావు, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మండల రెవెన్యూ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యాలయ భవనాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. ఆర్థిక భారం ఉన్న సూపర్ సిక్స్‌లోని పథకాలను వరుసగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అంతా దోచుకోవడం, దాచుకోవడమే జరిగిందని విమర్శించారు. ప్రజల భూములను హరించేందుకు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తీసుకొచ్చిందని, తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి రోజే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసిందని గుర్తు చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన రీ సర్వేను గత వైసిపి నాయకులు స్వప్రయోజనాల కోసం తప్పుల తడకగా మార్చారని ఎద్దేవా చేశారు. వందల కోట్ల రూపాయలు ఖర్చుచేసి సర్వే రాళ్లపై, పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మ వేశుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల అకాంక్షలకు అనుగుణంగా పని చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యతనిస్తూ పరిపాలన అందిస్తుందన్నారు. పెద్దాపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని, సామర్లకోట ప్రాంతంలోని లో ఓల్టేజి సమస్యను పరిష్కరించేందుకు సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పాల్గొన్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 225/2025-జి-1 — తేది.13-05-2025

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ దిగువ తెలిపిన మాస్టర్ ప్లాను రోడ్లు అనగా 1. పావురాల తూము నుండి ఉప్పరిపేట రోడ్డు, 2. JNTUK స్టేడియం రోడ్డు, 3. గ్రంధి కళ్యాణ మండపం రోడ్డు, సిదార్ధ నగర్, 4. సాంబమూర్తి నగర్ 5వ వీధి, 5. సూర్యరావుపేట, బీచ్ రోడ్డు దగ్గర, త్యాగరాజు నగర్, 6. మెయిన్ రోడ్డు (or) సుభాష్ రోడ్డు, 7. మెహర్ నగర్ రోడ్డు, 8. యేసు వారి వీధి, జగన్నాథపురం నందు భవిష్యతులో అభివృద్ధి చేయవలసిన రోడ్లు నిమిత్తము ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన స్థలములు అవసరమై యున్నందున ఆయా వ్యక్తులు ముందుకు వచ్చి పై తెలిపిన రోడ్లు విస్తరణలో పోవుచున్న స్థలములను నగరపాలక సంస్థకి స్వాధీనపరచుటకు తద్వారా వారికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారమునకు బదులుగా Transferable Development Right Certificate (TDRC) నకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనియున్నారు.

ఇందుపై ప్రస్తుతము అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు G.O.Ms. No. 119 MA&UD, Dept Dt. 28-03-2017, G.O.Ms. No. 180, MA&UD, Dept. 01-10-2020 మరియు తదుపరి ఉత్తర్వులు G.O.Ms. No. 4, MA&UD, Dept. 09-01-2025 లను అనుసరించి రోడ్డు విస్తరణకు కావలసిన స్థలమును స్వాధీనపరచుకుని Transferable Development Right Certificate (TDRC) జారీ చేయుటకు అవకాశము కల్పించబడినది. మరియు సదరు Transferable Development Right Certificate జారీ చేయుటకు సదరు దరఖాస్తులను సవివరముగా పరిశీలించి ఈ క్రింది తెలుపబడిన దరఖాస్తుదారులకు Transferable Development Right Certificate ల కొరకు TDR కమిటీ వారి నిర్ణయముకు లోబడి జారీ చేయబడునని తెలియచేయడమైనది.

S. No.	Name of the Applicant	Location of the Site Affected	Survey Number	Extent Affected in Road Widening as per Master Plan/ Area Development Plan in (Sq.m)	Master Plan Road/ Area Deveopment Plan Road / Connecting Road	Application Number/ date	Urban/ Rural	Remarks
1	Sagarapu Nookalamma / 012582	Pavuralathum to Uppari peta Road	237/4 Part	153.28	Master Plan	12582	Urban	
2	Gampu Veera Venkata Ramana / 010440	Stadium Road Gollala Street	88/3-2	48.16	Master Plan	10440	Urban	
3	1. Degala Suresh Kumar, 2. Degala Venkata Ramanamma, 3. Degala Ram Mohan Raja 4. P.N.V.V.S.Jayalakshmi Kumari, 5. Koppireddy Prameela Rani, 6. Vadupu Sridevi / 013131	Grandhi Kalyana Mandapam Road, Siddardha Nagar	121/1	55.49	Master Plan	13131	Urban	
4	Kotipalli Satyadevi / 002046	Sambamurthy Nagar 5th Street	136/4P ART	20.61	Master Plan	2046	Urban	
5	Patneedi Suryanarayana / 011894	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	109.67	Master Plan	11894	Urban	
6	Patneedi Bhavya Prathyusha / 011887	Suryaraopeta Near Beach Road, Thya garaju Nagar	255/1C	868.24	Master Plan	11887	Urban	
7	Patneedi Manoja Sreelakshmi Seetha Anusha / 011889	Suryaraopeta Near Beach Road	255/1C	433.48	Master Plan	11889	Urban	
8	Burra Veera Venkata Satyanarayana/ 011758	Meher nagar Road	209/3P	29.58	Master Plan	11758	Urban	
9	Allam Veera Venkata Malikarjuna Rao / 006379	Yesuvaristreet Jagannadhapuram Main Road	851/1 & 839/4	71.46	Master Plan	6379	Urban	
10	Appana Kamaraju / 013770	Main (Subash) Road	987	87.07	Master Plan	13770	Urban	

పైన తెలిపిన దరఖాస్తుల విషయమై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 07 రోజులలోగా ఈ క్రింది సంతకము దారునకు లిఖిత పూర్వకముగా ఆఫీసు పని వేళలలో అందజేయవలసినదిగా కోరడమైనది.

సం/- **కమిషనరు,** కాకినాడ నగరపాలక సంస్థ